క్లుప్తంగా

లక్ష రూపాయలు సీజ్



ఆత్మకూరు: ఆధారాలు లేకుండా కారులో తీసుకెళ్తున్న లక్ష రూపాయల నగదును పోలీస్‌లు సీజ్ చేశారు. వివరాలు ఇలా ఉన్నాయి. ములుగు మండలం మహ్మద్‌గౌస్‌పల్లికి చెందిన వ్యాపారి గాజుల రాజన్న వరంగల్ నుంచి ములుగుకు బొలెరో వాహనంలో వెళ్తున్నాడు. ఈ క్రమంలో మండలంలోని కటాక్షపూర్ చెక్ పోస్టు వద్ద పోలీస్‌లు గురువారం రాత్రి తనిఖీలు నిర్వహించారు. దీంతో రాజన్న వద్ద లక్ష రూపాయలు లభించగా అతని వద్ద డబ్బులకు సంబంధించిన ఆధారాలు లేకపోవడంతో సీజ్ చేసినట్లు ఎస్సైలు ప్రసాద్, రాజేష్‌రెడ్డి తెలిపారు.

ప్రజలు బీఆర్‌ఎస్ మాటలను నమ్మరు



ఆత్మకూరు: బీఆర్‌ఎస్ పార్టీ మాయమాటలను ప్రజలు నమ్మే పరిస్థితిలో లేరని బీజేపీ రాష్ట్ర నాయకుడు డాక్టర్ కాళీప్రసాద్‌రావు అన్నారు. మండల కేంద్రంలో గురువారం ఆయన ఇంటింటా ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ముఖ్యమంత్రి కేసీఆర్ ఎన్నికల్లో గెలిచేందుకు చెబుతున్న మాయమాటలు ఇక చెల్లవన్నారు. రాష్ట్రంలో నిరుద్యోగ యువత, విద్యార్థులు తీవ్ర మనస్తాపంలో ఉన్నారన్నారు. బీజేపీతోనే రాష్ట్రం సుభిక్షం అవుతుందని, ప్రజలు ఆశీర్వదించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షుడు ఇర్సడ్ల సదానందం, మండల కార్యదర్శి బయ్య పైడి, నాయకులు వంగాల బుచ్చిరెడ్డి, మాడిశెట్టి రవీందర్, పూజారి సత్యనారాయణ, తోట మల్లేశం, అయోధ్య, మధు పాల్గొన్నారు.

సఖి సేవలను వినియోగించుకోవాలి



శాయంపేట : మండలంలోని ప్రజలు సఖి కేంద్రంసేవలను వినియోగించుకోవాలని చేసుకోవాలని కేసువర్కర్ వినీల, హరిత అన్నారు. మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో గురువారం సఖి సేవలపై మహిళలకు అవగాహన కల్పించారు. సర్వోదయ యూత్ ఆర్గనైజేషన్, మహిళా అభివృద్ధి, శిశు సంక్షేమశాఖ ఆధ్వర్యంలో సఖి వన్ స్టాప్ సెంటర్ నిర్వహించబడుతుందని అన్నారు. విడిపోయే భార్యభర్తలకు కౌన్సిలింగ్ ద్వారా కలపడం, వరకట్న వేధింపులు, లైంగిక వేధింపులు, ఆడపిల్ల వద్దని అకారణంగా గర్భవిచ్ఛిత్తి వేధింపులకు గురయ్యే, ఇతర మానసికంగా వేధింపులకు గురయ్యే మహిళలకు, బాలికలకు రక్షణ కల్పించడమే సఖి కేంద్రం ముఖ్య ఉద్దేశం అన్నారు. హింసలకు గురయ్యే మహిళలు, యువతులు అధైర్య పడొద్దని సఖీ కేంద్రాన్ని ఆశ్రయించాలని ఆమె సూచించారు. ఆపదలో ఉన్న మహిళలను ఆదుకునేందుకు 24 గంటలు కేంద్రం అందుబాటులో ఉంటుందన్నారు. ఆపదలో ఉండే మహిళలు, యువతులు 0870-2452112, లేదా 181 టోల్ ఫ్రీ నంబర్‌కు ఫోన్ చేయాలని సూచించారు. గ్రామాల్లో సఖి సేవలపై విస్తృత ప్రచారం చేయాలని ఈ సందర్భంగా ఆమె కోరారు. ఈ సమావేశంలో ఎంపీడీఓ కృష్ణమూర్తి, ఏపీఓ కీర్తిఅనిత, పంచాయతీ కార్యదర్శులు, మహిళలు పాల్గొన్నారు.

అల్పాహారంతో ఆరోగ్యం



దామెర: అల్పాహారంతో పిల్లలకు మరింత ఆరోగ్యం లభిస్తుందని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయుడు రాజేష్‌కుమార్ అన్నారు. మండల కేంద్రంలోని ప్రాథమిక పాఠశాలలో గురువారం సీఎం అల్పాహారం కార్యక్రమాన్ని ఆయన గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడారు. పిల్లల శక్తిని పెంచేందుకు అల్పాహారం దోహదపడుతుందన్నారు. ఉపాధ్యాయులు జమ్మూనాయక్, సబితాదేవి, సుదర్శన్, ఎస్ఎంసీ చైర్మన్ బోడ శ్రీనివాస్, ఉపాధ్యాయులు ప్రభాసిని, సహనలత, మాధవి, కవిత, మంజుల, విజయలక్ష్మి, నజీమాబేగం, కళావతి, సీఆర్‌పీ నరేష్ తదితరులు పాల్గొన్నారు.

ఐనవోలులో..

ఐనవోలు: మండలంలోని రాంనగర్ ప్రభుత్వ పాఠశాలలో గురువారం సీఎం అల్పాహార పథకం ప్రారంభమైంది. మొదటి దశలో ఎంపిక కావడంతో విద్యార్థులకు అల్పాహారం అందించినట్లు హెచ్ఎం బానోతు రవికుమార్ తెలిపారు. ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

రాష్ట్రంలో బీఆర్‌ఎస్‌దే అధికారం

- ఎమ్మెల్సీ కడియం శ్రీహరి
- గ్రామాల్లో బీఆర్‌ఎస్ నాయకుల ప్రచారం

ధర్మసాగర్: రాష్ట్రంలో బీఆర్‌ఎస్ పార్టీ అధికారంలోకి రానున్నదని ఎమ్మెల్సీ కడియం శ్రీహరి అన్నారు. రాష్ట్రంలో బీఆర్‌ఎస్ అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను నిలుపుదల చేయాలని కేంద్ర ఎన్నికల సంఘానికి కాంగ్రెస్ పార్టీ నేతలు ఫిర్యాదు చేశారని, ప్రజలు లబ్ధిపొందితే వారి కళ్లు ఓర్వడం లేదని విమర్శించారు. మండలంలోని రాయిగూడెం, తాటికాయల, కరుణాపురం గ్రామాల్లో గురువారం బీఆర్‌ఎస్ కార్యకర్తల ఆత్మీయ సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. రైతుకు అండగా ఉండాలని, వ్యవసాయాన్ని పండుగ చేయాలని సీఎం కేసీఆర్ ఆలోచిస్తున్నారని అన్నారు. 24 గంటల ఉచిత కరెంటు, రైతుబంధు, రైతుబీమా అందిస్తూ రైతులు పండించిన పంటలను ప్రభుత్వమే కొనుగోలు చేసి రైతులకు అండగా నిలుస్తున్న ఏకైక ప్రభుత్వం బీఆర్‌ఎస్ అన్నారు. రాష్ట్రంలో అమలవున్న సంక్షేమ పథకాలు కాంగ్రెస్ పాలిత రాష్ట్రాల్లో అమలు చేస్తున్నారా అని ప్రశ్నించారు. ఆరు గ్యారెంటీ పథకాలతో ప్రజల ముందుకు వస్తున్నారని, కానీ కాంగ్రెస్ పార్టీకే గ్యారంటీ లేదని విమవర్శించారు. ప్రజలు మోసపూరిత మాటలు నమ్మొద్దని కోరారు. డీసీసీబీ డైరెక్టర్ గుర్రెడ్డి రాజేశ్వర్‌రెడ్డి, జెడ్పీటీసీ పిట్టల శ్రీలత, ఆయా గ్రామాల సర్పంచ్‌లు పెసరు రమేష్, వాంకుడోతు రాజమణి, కలకోటి అనిల్‌కుమార్, మునిగాల యాకుబ్, వివిధ గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, బీఆర్‌ఎస్ శ్రేణులు తదితరులు పాల్గొన్నారు.



ధర్మసాగర్ : మాట్లాడుతున్న కడియం శ్రీహరి

బీఆర్‌ఎస్ నాయకుల ప్రచారం..

వేలేరు : బీఆర్‌ఎస్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి కడియం శ్రీహరిని భారీ మెజారిటీతో గెలిపించాలని ఆపార్టీ మండల అధ్యక్షుడు మరిజె నర్సింగరావు అన్నారు. మండలంలోని పీచర గ్రామంలో గురువారం కడియం శ్రీహరికి మద్దతుగా బీఆర్‌ఎస్ నాయకులు ఇంటింటా ప్రచారం నిర్వహించారు. సీఎం కేసీఆర్ నాయకత్వంలో సంక్షేమ పథకాలు అన్ని వర్గాల ప్రజలకు అందుతున్నాయని అన్నారు. పార్టీ మేనిఫెస్టోను ప్రజలకు వివరించారు. సర్పంచ్ మ్యాక రవీందర్, ఏఎంసీ వైస్ చైర్మన్ గుజ్జుల రాంగోపాల్‌రెడ్డి, ఆత్మ చైర్మన్ కీర్తి వెంకటేశ్వర్లు, మాజీ సర్పంచ్ ఏలూరి వీరయ్య, కడియం యువసేన అధ్యక్షుడు మారబోయిన రాజు, బైరబోయిన గట్టయ్య, ప్రమోద్‌రెడ్డి పాల్గొన్నారు.



వేలేరు : ప్రచారం నిర్వహిస్తున్న నాయకులు

ధర్మసాగర్‌లో..

ధర్మసాగర్ : స్టేషన్ ఘనపూర్ నియోజకవర్గ బీఆర్‌ఎస్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి కడియం శ్రీహరిని అధిక మెజారిటీతో గెలిపించాలని ఆ పార్టీ ఎస్సీ సెల్ నియోజకవర్గ కన్వీనర్ కనకం రమేష్ పిలుపునిచ్చారు. మండల కేంద్రంలో గురువారం విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడారు. నియోజకవర్గాన్ని అభివృద్ధి పథంలో నడిపించేందుకు కృషి చేస్తున్న కడియంను గెలిపించాలని కోరారు. త్వరలో జరిగే ఎన్నికల్లో కొంత మంది ప్యారాషూట్ వ్యక్తులు వస్తున్నారని, ఏసీల్లో వచ్చి ఏసీల్లో పోతుంటారని వారికి ఓటు వేస్తే అభివృద్ధి కుంటుపడుతుందని ఆరోపించారు. నాయకులు ప్రభుదాస్, సోమయ్య, నియోజకవర్గ కో ఆర్డినేటర్‌లు రమేష్, వెంకటస్వామి, బాబు, జోసప్, ప్రదీప్‌కుమార్, ప్రతాప్, ప్రేమ్ రాజ్, రమణాకర్, రవీందర్ పాల్గొన్నారు.

ఎమ్మెల్యే 'చల్లా'ను మరోసారి గెలిపించాలి



నడికూడ : మాట్లాడుతున్న చంద్రమౌళి.



ఆత్మకూరు : ఎమ్మెల్యేతో ఆరె కులస్తులు

నడికూడ: త్వరలో జరిగే అసెంబ్లీ ఎన్నికల్లో ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డిని మరోసారి భారీ మెజారిటీతో గెలిపించాలి బీఆర్‌ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు దురిశెట్టి చంద్రమౌళి కోరారు. మండల కేంద్రంలో గురువారం ఆయన విలేకరులతో మాట్లాడారు. అసెంబ్లీ ఎన్నికల్లో మూడోసారి ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించాలని, చల్లా చేసిన అభివృద్ధిని ఇంటింటా ప్రచారం చేయాలని కార్యకర్తలకు సూచించారు. అనంతరం మండలంలోని వరికోల్, పులిగిల్ల, రాయపర్తి, నడికూడ గ్రామాల బీఆర్‌ఎస్ బూత్ కమిటీల కన్వీనర్, కో కన్వీనర్‌లను ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో నందికొండ గణపతి రెడ్డి, జయపాల్‌రెడ్డి, గోల్కొండ సదానందం, కరుణకర్, బొల్లారం అనిల్ కుమార్, పోచంపల్లి రఘుపతి, దురిశెట్టి వెంకటేష్, నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

మద్దతు తెలిపిన ఆరె కులస్తులు

ఆత్మకూరు: మండలంలోని నీరుకుళ్ల గ్రామానికి చెందిన 36 ఆరె కుటుంబాలు ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డికి మద్దతు తెలుపుతూ ఏకగ్రీవ తీర్మానం చేశారు. ఈ మేరకు గురువారం హనుమకొండలోని ఎమ్మెల్యే నివాసగృహంలో ధర్మారెడ్డితో మాట్లాడి మద్దతు తెలిపారు. మూడోసారి గెలుపు ఖాయమని అన్నారు. సర్పంచ్ అర్షం బలరాం, బీఆర్‌ఎస్ గ్రామ అధ్యక్షుడు సాంబమూర్తి, నాయకులు శ్రీధర్, అర్షం రాజేందర్, ఆరె కులస్తులు సాంబరావు, లొల్లాటి రాజు, శ్రీనివాస్, నర్సింగరావు పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్‌ను ఆశీర్వదించండి



మాట్లాడుతున్న మాజీ మంత్రి ఇనుగాల పెద్దిరెడ్డి పక్కన ఎమ్మెల్యే అభ్యర్థి సతీశ్‌కుమార్

ఎల్కతుర్తి: తెలంగాణలో జరుగుతున్న అభివృద్ధి, అమలవుతున్న సంక్షేమ పథకాలు ఎప్పటికీ కొనసాగాలంటే బీఆర్‌ఎస్ పార్టీని ప్రజలు ఆదరించి ఆశీర్వదించాలని హుస్నాబాద్ నియోజకవర్గ ఎన్నికల ఇన్‌చార్జ్, మాజీ మంత్రి ఇనుగాల పెద్దిరెడ్డి కోరారు. గురువారం భీమదేవరపల్లి మండలం కొత్తకొండ వీరభద్రస్వామి ఆలయంలో ఎమ్మెల్యే అభ్యర్థి వొడితెల సతీశ్‌కుమార్‌తో కలిసి ఆయన ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం చంటయ్యపల్లి, ధర్మారం, గోవర్ధన్‌తండా, రసూల్‌పల్లి, వీర్లగండ తండా గ్రామం, మల్లారం గ్రామాల్లో ఎన్నికల ప్రచారం కొనసాగించారు. ఈసందర్భంగా పెద్దిరెడ్డి మాట్లాడుతూ.. బీఆర్‌ఎస్ ప్రభుత్వం వచ్చిన వెంటనే నియోజకవర్గంలోని గౌరవెల్లి, గండిపల్లి ప్రాజెక్టును ప్రారంభించి సాగునీటి సమస్యను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. ఎమ్మెల్యే అభ్యర్థి వొడితెల సతీశ్‌కుమార్ మాట్లాడుతూ.. అభివృద్ధి, సంక్షేమ పథకాలు నిరంతరం కొనసాగాలంటే బీఆర్‌ఎస్ పార్టీని ఆశీర్వదించాలని, తనకు మరో అవకాశం కల్పించాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీపీలు జక్కుల అనితరమేశ్, మేకల స్వప్న, జెడ్పీటీసీ వంగ రవీందర్, ఇంద్రనీల్, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షులు మారుపాటి మహేందర్‌రెడ్డి, గొడిశాల సమ్మయ్యగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

పాత్రికేయుడిపై బీఆర్‌ఎస్ నాయకుల దాడి

ఎమ్మెల్యే సతీశ్‌కుమార్ రసూల్‌పల్లిలో ప్రచారం నిర్వహిస్తుండగా.. ఆ గ్రామానికి చెందిన కొందరు బీఆర్‌ఎస్ నాయకుల మధ్య తీవ్రస్థాయిలో వాగ్వాదం చోటు చేసుకుంది. ఈదృశ్యాలను ఓ పాత్రికేయుడు సెల్‌ఫోన్‌లో చిత్రీకరిస్తున్న క్రమంలో బీఆర్‌ఎస్ నాయకులు పాత్రికేయుడి ఫోన్ లాక్కుని చితకబాదారు. ఆసమయంలో పోలీసులు పక్కనే ఉన్నప్పటికీ పట్టించుకోలేదని పలువురు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

రైతు వ్యతిరేక పార్టీకి ఓటుతో బుద్ధి చెప్పాలి

- ఎమ్మెల్సీ బస్వరాజు సారయ్య

శాయంపేట : రైతుల సంక్షేమం కోసం బీఆర్‌ఎస్ పార్టీ రైతుబంధు అమలు చేస్తుండగా ఏఐసీసీ ఇన్‌చార్జ్ మాణిక్‌రావుఠాక్రే రైతుల ఖాతాల్లో నగదు జమ ఆపాలని ఈసీకి లేఖ రాయడం సిగ్గుచేటని ఎమ్మెల్సీ బస్వరాజు సారయ్య మండిపడ్డారు. రైతు వ్యతిరేక పార్టీకి ప్రజలే ఓటుతో బుద్ధి చెప్పాలని సూచించారు. మండలంలోని గోవిందాపూర్ గురువారం ముఖ్య కార్యకర్తల సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడారు. రాష్ట్రంలో 93 లక్షల ఆహార భద్రత కార్డుదారులందరికీ రైతుబంధు తరహాలో ప్రభుత్వం ఏర్పడిన వెంటనే కేసీఆర్ బీమా పథకాన్ని సీఎం కేసీఆర్ అమలు చేస్తారని అన్నారు. ఎన్నికల మేనిఫెస్టోలో ప్రకటించారని గుర్తు చేశారు. భారత దేశ చరిత్రలో 29 రాష్ట్రాలు అమలు చేయని పథకాలను తెలంగాణ రాష్ట్రం అమలు చేస్తూ దిక్సూచిలా నిలుస్తుందని కొనియాడారు. ఎన్నికల్లో భూపాలపల్లి ఎమ్మెల్యేగా గండ్ర వెంకటరమణారెడ్డిని మరోసారి గెలిపించాలని కోరారు. ఎమ్మెల్యే గండ్ర వెకటరమణారెడ్డి, జెడ్పీ చైర్ పర్సన్ గండ్ర జ్యోతి, ఎంపీపీ మెతుకు తిరుపతిరెడ్డి, వర్కింగ్ ప్రెసిడెంట్ గుర్రం అశోక్, మండల మాజీ అధ్యక్షుడు రవీందర్, మాజీ వైస్ ఎంపీపీ నారాయణరెడ్డి పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ సారయ్య

పోలింగ్ బూత్‌ల పరిశీలన



53వ పోలింగ్ బూత్‌ను పరిశీలిస్తున్న కమిషనర్

పరకాల: పట్టణంలోని పోలింగ్ బూత్‌ల వద్ద ఓటర్లకు ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు చేపట్టినట్లు మున్సిపల్ కమిషనర్, ఎన్నికల ఎంసీసీటీం అధికారి టి.శేషాంజన్‌స్వామి తెలిపారు. గురువారం పట్టణంలోని హరితనగర్‌లో గల ప్రాథమిక పాఠశాలలో ఏర్పాటు చేసిన 52, 53 పోలింగ్ బూత్‌లను ఆయన పరిశీలించారు. ఏఎస్సై సత్యనారయణ, మున్సిపల్ సానిటేషన్ అధికారి వెంకట్‌రెడ్డి, బీఎల్‌ఓలు పాల్గొన్నారు. త్వరలో జరిగే ఎన్నికల నిర్వహణకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలని సిబ్బందికి సూచించారు. వృద్ధులు, వికలాంగులు ఓటుహక్కు వినియోగించుకునేందుకు పోలింగ్ కేంద్రానికి వచ్చేందుకు ఇబ్బందులు లేకుండా చూడాలని సూచించారు.

ప్రజారోగ్య పరిరక్షణే రెడ్‌క్రాస్ లక్ష్యం

- రెడ్‌క్రాస్ జిల్లా చైర్మన్ విజయ్‌చందర్‌రెడ్డి

దామెర: ప్రజల ఆరోగ్యాన్ని పరిరక్షించడమే ఇండియన్ రెడ్‌క్రాస్ లక్ష్యమని ఆ సంస్థ జిల్లా చైర్మన్ డాక్టర్ పెసరు విజయ్‌చందర్‌రెడ్డి అన్నారు. మండలంలోని ల్యాదెళ్లలో 35 లక్షల వ్యయంతో నిర్మించిన గ్రామీణ ఆరోగ్య కేంద్రాన్ని గురువారం ప్రారంభించారు. అనంతరం ఉచిత వైద్య శిబిరం నిర్వహించి మాట్లాడారు. ఆరోగ్య కేంద్రంలో వివిధ రకాల వైద్య నిపుణులు అందుబాటులో ఉంటారని అన్నారు. నిరుపేదలకు ఉచిత వైద్యం అందిచడంతో పాటు మందులు పంపిణీ చేయనున్నట్లు వెల్లడించారు. ప్రజలు ఈ సేవలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో రెడ్‌క్రాస్ పాలకవర్గ సభ్యులు శ్రీనివాస్, డాక్టర్ సంధ్యారాణి, వేణుగోపాల్, మాజీ సర్పంచ్‌లు మహిపాల్‌రెడ్డి, వెంకటేశ్వర్లు, మాజీ ఎంపీటీసీ రమేష్ యాదవ్, దామెర సర్పంచ్ శ్రీరాంరెడ్డి, బీజేపీ మండల అధ్యక్షుడు నాగరాజు, శ్రీకాంత్, రమేష్, అనిల్, ప్రశాంత్, రాజు, చిరంజీవి, బుచ్చిరెడ్డి, సతీష్, జగన్, సుధాకర్, సాంబరాజు పాల్గొన్నారు.



ఆరోగ్య కేంద్రం ప్రారంభిస్తున్న విజయ్‌చందర్‌రెడ్డి

రికార్డులను డిజిటలైజ్ చేసుకోవాలి



పోలీస్‌స్టేషన్‌లో రికార్డులు పరిశీలిస్తున్న సీపీ



విద్యార్థులతో ముచ్చటిస్తున్న సీపీ కిషోర్ ఝూ

ఆత్మకూరు: పోలీస్‌స్టేషన్‌లో రికార్డులను ఎప్పటికప్పుడు డిజిటలైజ్ చేసుకోవాలని వరంగల్ సీపీ అంబర్ కిషోర్ ఝూ సూచించారు. మండలకేంద్రంలోని పోలీస్‌స్టేషన్‌ను గురువారం ఆయన పరిశీలించారు. ఇటీవల నమోదైన కేసులు, పరిష్కారాలపై సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. మండలకేంద్రంతోపాటు కటాక్షపూర్ పోలింగ్ కేంద్రాలను పరిశీలించారు. ఆత్మకూరు జెడ్పీ హైస్కూల్ వద్ద విద్యార్థులతో సరదాగా మచ్చటించి జనరల్ నాలెడ్జ్ ప్రశ్నలు అడగగా, విద్యార్థులు సమాధానాలు సరిగా చెప్పడంతో అభినందించారు. ఎన్నికల నిర్వహణలో అందరూ బాధ్యతాయుతంగా పనిచేయాలని సిబ్బందికి సూచించారు. శాంతియుత వాతావరణానికి అన్ని రాజకీయ పార్టీలు, ప్రజలు సహకరించాలన్నారు. ఏసీపీ కిషోర్‌కుమార్, సీఐ రవిరాజు, ఎస్ఐలు ప్రసాద్, రాజేష్‌రెడ్డి పాల్గొన్నారు.

బాలకార్మిక వ్యవస్థను నిర్మూలించాలి



మాట్లాడుతున్న శ్రీనివాస్

శాయంపేట : బాలకార్మిక వ్యవస్థను నిర్మూలించేందుకు ప్రతిఒక్కరూ కృషి చేయాలని ప్రజ్వల్ రైతు ఉత్పత్తిదారుల సంఘం, బీసీఐ ప్రాజెక్టు కోఆర్డినేటర్ అనుముల శ్రీనివాస్ అన్నారు. మండల కేంద్రంలోని మారి స్వచ్ఛంద సంస్థ కార్యాలయంలో గురువారం వివిధ గ్రామాల్లో పనిచేస్తున్న సిబ్బందికి శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బాలకార్మిక వ్యవస్థను నిర్మూలించేందుకే బీసీఐ పనిచేస్తుందన్నారు. గ్రామాల్లో ఎలాంటి పరిస్థితుల్లోనైనా బాలకార్మికులు లేకుండా చూడాలని, అది అందరి బాధ్యత అన్నారు. ఈ కార్యక్రమంలో టెక్నికల్ కోఆర్డినేటర్ కుమారస్వామి, పీయూ మేనేజర్ ప్రియాంకరెడ్డి, అసోసియేట్ పీయూ మేనేజర్ అక్కల రమేష్.

హామీల అమలులో బీఆర్‌ఎస్ విఫలం

- కాంగ్రెస్ ఎమ్మెల్యే అభ్యర్థి గండ్ర

శాయంపేట : బీఆర్‌ఎస్ రాష్ట్ర అధ్యక్షుడు, సీఎం కేసీఆర్ ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలు చేయడంలో పూర్తిగా విఫలమయ్యారని కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి గండ్ర సత్యనారాయణరావు అన్నారు. మండల కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో గురువారం పరకాల ఏఎంసీ మాజీ చైర్మన్ పోలపల్లి శ్రీనివాస్‌రెడ్డి, బీఆర్‌ఎస్ నాయకులు డీటీరెడ్డి, సాదోనిపల్లి మాజీ సర్పంచ్ లావుడ్య వెంకటేష్‌తో పాటు వివిధ గ్రామాలకు చెందిన ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు కాంగ్రెస్‌లో చేరగా ఆయన కండువా కప్పి ఆహ్వానించారు. అనంతరం మండల కేంద్రం నుంచి హుస్సేన్‌పల్లి వరకు చేపట్టిన బైక్ ర్యాలీని ప్రారంభించి మాట్లాడారు. కాంగ్రెస్ హయాంలోనే రైతులకు రుణమాఫీ, ఉచిత కరెంట్, ఇందిరమ్మ ఇళ్లు, ఆరోగ్యశ్రీ పథకాలు అందాయని అన్నారు. మండలానికి అంబులెన్స్ లేకపోవడంతో నిరుపేదల ప్రాణాలు గాలిలో కలిసిపోయాయని, అయినా స్థానిక ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి పట్టించుకోవడం లేదని ఆరోపించారు. గోవిందాపూర్ గ్రామంలో ఎమ్మెల్యే సతీమణికి ఓటు హక్కు కల్పించి జెడ్పీటీసీగా గెలిపిస్తే మండలంలో వెలగబెట్టిన అవృద్ధి ఎంటో చూపాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షుడు దూదిపాల బుచ్చిరెడ్డి, మాజీ జెడ్పీటీసీ చల్లా చక్రపాణి, నాయకులు చిందం రవి, మారంపల్లి రవీందర్, దుబాసి కృష్ణమూర్తి, కుమారస్వామి, కట్టయ్య, రాజు, రఫీ, మార్కండేయ, రాజిరెడ్డి, ప్రభాకర్‌రెడ్డి, వలిహైదర్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న గండ్ర సత్యనారాయణరావు

తాళం వేసిన ఇళ్లే టార్గెట్

- రూ.20 వేలు, అర్ధతులం బంగారం చోరీ

కమలాపూర్: తాళం వేసిన ఇళ్లను దొంగలు టార్గెట్ చేశారు. ఇనుప రాడ్డుతో తాళాన్ని ధ్వంసం చేసి రూ.20వేల నగదుతో పాటు అర్ధతులం బంగారం అపహరించారు. ఇన్‌స్పెక్టర్ సంజీవ్ తెలిపిన వివరాల ప్రకారం. మండల కేంద్రానికి చెందిన చిగురు రాజయ్య-ప్రమీళ దంపతులు గత ఆదివారం ఇంటికి తాళం వేసి దసరా పండుగ సందర్భంగా జయశంకర్ భూపాలపల్లిలోని తన కుమారుడి ఇంటికి వెళ్లారు. తిరిగి గురువారం కమలాపూర్‌కు చేరుకున్నారు. ఇంటికి వేసిన తాళం పగులగొట్టి ఉండడంతో దొంగలు పడినట్లు అనుమానం వచ్చింది. ఇంట్లోకి వెళ్లి చూసేసరికి సామానంతా చిందరవందరగా పడి ఉండగా బీరువాలో దాచుకున్న రూ.20 వేల నగదుతో పాటు అర్ధతులం బంగారు ఉంగరం కనిపించలేదు. వెంటనే పోలీస్‌లకు సమాచారం అందించగా వేలిముద్రల నిపుణులతో వేలిముద్రలు సేకరించినట్లు తెలిపారు. గుర్తు తెలియని దుండగులు ఇంటి తాళం పగులగొట్టి చోరీకి పాల్పడ్డారని బాధితులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఆయన తెలిపారు.



ఇనుపరాడ్‌తో పగులగొట్టిన తాళం

అభివృద్ధిని చూసి ఆశీర్వదించండి

- ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి

శాయంపేట : రాష్ట్ర ముఖ్యమంత్రి కేసీఆర్ అన్ని వర్గాల ప్రజలకు సంక్షేమ పథకాలు అందిస్తూ, కోట్లాది రూపాయలతో చేస్తున్న అభివృద్ధి చూసి బీఆర్‌ఎస్‌ను ఆశీర్వదించాలని ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి అన్నారు. మండలంలోని నర్సింహులపల్లి, సూరంపేట, తహరాపూర్, గోవిందాపూర్, పెద్దకోడెపాక, జోగంపల్లి, వసంతపూర్, గంగిరేణిగూడెం, సూర్యానాయక్‌తండా, సాధోనిపల్లి, రాజుపల్లి, కాట్రపల్లి గ్రామాలల్లో గురువారం ఆ పార్టీ ముఖ్య కార్యకర్తల సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడారు. కర్ణాటకలో కాంగ్రెస్ పార్టీకి అధికారం అప్పగించగా రైతులకు సరిపడా కరెంట్ ఇవ్వడంలేదని, దీంతో రైతులు రోడ్డెక్కి ఆందోళనలు చేస్తున్నారని తెలిపారు. రైతులను వ్యతిరేకించే కాంగ్రెస్ కావాలా.. రైతుల సంక్షేమానికి కట్టుబడిఉన్న బీఆర్‌ఎస్ కావాలో ప్రజలు ఆలోచించాలని కోరారు. ప్రజలు మరోసారి ఆశీర్వదించి గెలిపించాలని కోరారు. ఎమ్మెల్సీ బస్వరాజు సారయ్య, జెడ్పీ చైర్‌పర్సన్ గండ్ర జ్యోతి, పీఏసీఎస్ చైర్మన్ కుసుమ శరత్, పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ గుర్రం అశోక్, మండల మాజీ అధ్యక్షుడు గుర్రం రవీందర్, మాజీ వైస్ఎంపీపీ వంగాల నారాయణారెడ్డి, పరకాల ఏఎంసీ వైస్ చైర్మన్ మారపల్లి నంద, చలివాగు ప్రాజెక్టు మాజీ చైర్మన్ ఇమ్మడి శెట్టి సదానందం, సర్పంచ్ చిటిరెడ్డి రాజిరెడ్డి, ఎంపీటీసీ వావిలాల వేణుగోపాలప్రసాద్, కార్యకర్తలు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే గండ్ర

కాంగ్రెస్‌ను నమ్మితే నట్టేట మునగడం ఖాయం

- ప్రభుత్వ విప్, ఎమ్మెల్సీ పాడి కౌశిక్‌రెడ్డి

కమలాపూర్: కాంగ్రెస్‌ను నమ్మితే నట్టేట మునగడం ఖాయమని, తెలంగాణలో అమలవుతున్న రైతుబంధు, రైతు రుణమాఫీ, కల్యాణలక్ష్మి, కేసీఆర్ కిట్లు, పింఛన్లు ఆపాలని కాంగ్రెస్ నాయకులు ఎన్నికల కమిషన్‌కు లేఖ రాయడం చాలా బాధాకరమని బీఆర్‌ఎస్ పార్టీ హుజూరాబాద్ అభ్యర్థి పాడి కౌశిక్‌రెడ్డి అన్నారు. మండలంలోని ఉప్పల్‌లో గురువారం ఆయన విలేకరులతో మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ కేవలం ఎన్నికల కోసం ఆన్‌గోయింగ్ పథకాలను ఆపాలనడం సిగ్గుచేటని, కాంగ్రెస్ తీరును రైతన్నలు గమనించాలన్నారు. ఇలాంటి చిల్లర రాజకీయాలు, చిల్లర పనులు కాంగ్రెస్, బీజేపీ నాయకులు మానుకోవాలని హితవు పలికారు. అనంతరం బీఆర్‌ఎస్ కార్యకర్తలతో కలిసి ఆయన నిరసన తెలిపారు.

ఒక్క అవకాశమివ్వండి.. ఐదేళ్లు సేవ చేస్తా

తనకు ఒక్క అవకాశమిచ్చి గెలిపిస్తే ఐదేళ్ల పాటు మీకు సేవ చేస్తానని ప్రభుత్వ విప్, ఎమ్మెల్సీ, బీఆర్‌ఎస్ పార్టీ హుజూరాబాద్ అభ్యర్థి పాడి కౌశిక్‌రెడ్డి అన్నారు. ఉప్పల్, ఉప్పులపల్లి, దేశరాజుపల్లి గ్రామాల్లో గురువారం ఆయన పర్యటించారు. బీఆర్‌ఎస్ పార్టీ ముఖ్య కార్యకర్తలతో, కమలాపూర్‌లో గౌడ సంఘం ముఖ్య నాయకులతో నిర్వహించిన సమావేశాల్లో మాట్లాడారు. తనను ఎమ్మెల్యేగా గెలిపిస్తే కమలాపూర్‌ను మున్సిపాలిటీ చేస్తానని, ఉప్పల్, శనిగరం గ్రామాలను ప్రత్యేక మండలాలుగా ఏర్పాటు చేస్తానని హామీ ఇచ్చారు. ఆయా కార్యక్రమాల్లో సర్పంచులు ఉమారవీందర్, రమేష్, దేవేందర్‌రావు, ఎంపీటీసీల ఫోరం అధ్యక్షుడు సంపత్‌రావు, పీఏసీఎస్ వైస్ చైర్మన్ ఇంద్రసేనారెడ్డి, డైరెక్టర్ సత్యనారాయణరావు పాల్గొన్నారు.



కార్యకర్తలతో కలిసి నిరసన తెలుపుతున్న కౌశిక్‌రెడ్డి

భూ కబ్జాదారులపై చర్య తీసుకోవాలి

ఐనవోలు: మండలంలోని పున్నేలు గ్రామంలో సర్వే నంబర్ 120లో గల భూమి కబ్జాకు గురైందని తెలిసినా అధికారులు పట్టించుకోకపోవడం విడ్డూరంగా ఉందని బీజేపీ జిల్లా కార్యదర్శి గుండెకారి కోటేశ్వర్‌రావు మండిపడ్డారు. ఆ పార్టీ నాయకులతో కలిసి గురువారం క్రీడా ప్రాంగణంతో పాటు ప్రభుత్వ భూమిలో వెలసిన గుడిసెల స్థలాన్ని పరిశీలించారు. అనంతరం మండల కేంద్రంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. పున్నేలు క్రీడా ప్రాంగణంలో ఒక్క క్రీడా వస్తువు కనిపించడం లేదన్నారు. క్రీడా సామాగ్రి కొరకు ప్రభుత్వం కేటాయించిన రూ.3.5 లక్షలు వృధా అయ్యాయని, దీనికి పంచాయతీరాజ్‌శాఖ అధికారులే పూర్తి బాధ్యత వహించాలన్నారు. బీఆర్‌ఎస్ పార్టీ నాయకులు అధికార దుర్వినియోగానికి పాల్పడి భూములను కబ్జా చేసేందుకు ప్రయత్నించడం సిగ్గు చేటన్నారు. రాష్ట్రంలో ఎమ్మెల్యేలు, మంత్రులు, ముఖ్యమంత్రులు అవినీతికి పాల్పడుతుంటే గ్రామీణ ప్రాంతాల్లో వారి అనుచరులు భూ కబ్జాలకు చేస్తున్నారని ఆరోపించారు. పెద్దల అండదండలతో భూ మాఫీయా చేస్తున్నారని విమర్శించారు. జిల్లా కలెక్టర్ దృష్టి సారించి పూర్తి విచారణ చేపట్టి ఎంపీడీఓతో పాటు కబ్జా దారులపై చర్య తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు.